

# నేటి పత్రిక ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వారపత్రిక




విజయవాడ | తేదీ: 16 - 23 మే 2023 | ఎడిటర్ : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి : 2 | సంచిక : 49 | పేజీలు : 4, వెల: రూ.5

# సంక్షేమ సారథులు, నా సైన్యం వాలంటీర్లే : సీఎం జగన్






**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

ప్రజలకు వాలంటీర్లు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా వారికి వందనం చెబుతూ వరుసగా మూడో ఏడాది గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను ఇచ్చే కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం శ్రీకారం చుట్టారు. విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ ప్రజలకు, ప్రజా ప్రభుత్వానికి మధ్య వారధులు, సంక్షేమ సారథులు వాలంటీర్లు అని అన్నారు. వీళ్లు మంచి సేవకులు, సైనికులు. పేదలకు సేవలు చేసేందుకు 2.66లక్షల మంది సైన్యమే వాలంటీర్ వ్యవస్థ. కులం, మతం, వర్గం, రాజకీయపార్టీలు చూడకుండా అర్హత మాత్రమే ప్రమాణంగా తీసుకుని పథకాలు అమల్లో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. జగనన్న పెట్టుకున్న నమ్మకం వాలంటీర్లు. దేశంలో ఎక్కడకు వెళ్లి చూసినా.. మునుపెన్నడూ చూడని విధంగా ప్రజలకు వాలంటీర్ల ద్వారా మేలు జరుగుతోంది. ఇలాంటి సారథులు, వారధులు దేశంలో ఎక్కడా లేరు. మంచి మనసుతో అనేక మార్పులు తీసుకు వస్తున్నాం. అనేక మార్పులకు సాక్ష్యాలు కూడా వాలంటీర్లే అని అన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల అరాచకాలు చూశారు. వివక్ష, లంచాలు చూశాం. మన అందరి ప్రభుత్వం తీసుకు వచ్చిన తులసిమొక్కల్లాంటి వ్యవస్థే వాలంటీర్ల వ్యవస్థ. మంచి చేస్తున్న ప్రభుత్వానికి, మంచి చేస్తున్న ముఖ్యమంత్రికి బ్రాండ్ అంబాసిడర్లే వాలంటీర్లు. జగనన్న సైన్యం వాలంటీర్లు అని అన్నారు. తూర్పున సూర్యుడు ఉదయించకముందే ప్రతి అవ్వాతాతకు ఒక మంచి మనవరాలిగా, మనవడిగా.. వితంతువులు, దివ్యాంగులకు ఒక మంచి చెల్లెమ్మలా, అక్కలా, తమ్ముడిలా, అన్నలా ప్రతి నెలా ఒకటో తారీఖున 64 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్న గొప్ప సేవకులు, సైనికులు మన వలంటీర్లు అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికి రాబోయే రోజుల్లో ఇంకా ఎక్కువగా వెళ్లాలి. జరిగిన మంచిని చూపించాలి. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను వివరించాలి. ప్రజలందరికీ వ్యత్యాసాన్ని తెలియచేయాల్సిన బాధ్యత కూడా మీపైన ఉందన్నారు. వాలంటీర్లు చేస్తున్నది సేవ మాత్రమే. ఇది ప్రభుత్వ ఉద్యోగం పరిధిలోకి వచ్చే సేవ కాదు. ఇది స్వచ్ఛంద సేవ. దీని పేరే వాలంటీర్. ఇక్కడ పని చేస్తున్న ఏ ఒక్కరూ కూడా ప్రభుత్వ ఉద్యోగులు కారు. మీ అటెండెన్స్ కూడా ఎప్పుడైనా ప్రభుత్వ సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామని మార్కు చేసే కార్యక్రమం మాత్రమే. ఎవరైనా మిమ్మల్ని ఫలానా పని మీరు చేయకూడదంటే గట్టిగా సమాధానం చెప్పండన్నారు. వరుసగా మూడో ఏడాది సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అనే మూడు అవార్డులతో పది రోజులపాటు వలంటీర్లను రాష్ట్రవ్యాప్తంగా సత్కరించే కార్యక్రమాన్ని ఇక్కడ నుంచే ప్రారంభిస్తున్నాం. ఈ ఏడాది ఉత్తమ సేవలందించిన 2,33,719 మంది వలంటీర్లను సన్మానిస్తున్నాం. ఇది మీరు చేసిన సేవలకు కల్పిస్తున్న గుర్తింపు. ఇందుకోసం ఈ ఏడాది రూ.239 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

మొదటి స్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా 2,28,624 మంది సేవామిత్రలకు సత్కారంతో పాటు రూ.10 వేలు నగదు, ప్రశంసా పత్రంతో ప్రతి మండలంలో సన్మానాలు జరుగుతాయి. రెండో స్థాయిలో ప్రతి మండలంలో ఐదుగురు, మున్సిపాల్టీలు నగరపాలక సంస్థలలో 10 మంది చొప్పున ఎంపిక చేసిన 4,220 మంది సేవారత్నలకు రూ.20 వేలు నగదు బహుమతితో కూడిన సన్మానాలు జరుగుతాయి. మూడో స్థాయిలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఐదుగురు చొప్పున 875 మంది సేవా వజ్రలకు రూ.30 వేలు నగదు, మెడల్, బ్యాడ్జితోపాటు సర్టిఫికెట్ ఇచ్చి సన్మానిస్తాం. ఇలా ప్రతి సంవత్సరం మీరు చేస్తున్న సేవలకు గుర్తింపు రావాలని, మీ సేవలపై ప్రజల్లో చర్చ జరగాలని, మీలో ఏ ఒక్కరికీ లంచాలు, వివక్ష ఆలోచనలే మనసులోకి రాకూడదనే ఉద్దేశంతో ఆత్మస్థైర్యాన్ని పెంచుతూ, గుర్తింపునిస్తూ ఈ అవార్డులు అందిస్తున్నాం. మూడు విడతల్లో వలంటీర్ల పురస్కారాల కోసం ప్రభుత్వం రూ.705 కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. అనంతరం ఉత్తమ వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు.

## కర్ణాటకలో కొలువు తీరిన కాంగ్రెస్



**బెంగళూరు, నేటి పత్రిక ప్రజావార్త :**

కర్ణాటక 31వ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య, ఏకైక ఉప ముఖ్యమంత్రిగా పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. వీరితోపాటు ఎనిమిది మంది సీనియర్ నేతలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. గవర్నర్ థావర్ చంద్ గెహ్లాత్ వీరితో శనివారం ప్రమాణం చేయించారు. బెంగళూరులోని కంఠీరవ స్టేడియం దీనికి వేదికైంది. లక్ష మందికిపైగా అభిమానులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. 2013లో తొలిసారిగా ముఖ్యమంత్రి అయినప్పుడు కూడా సిద్ధరామయ్య ఇదే స్టేడియంలో ప్రమాణం చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు రాహుల్, ప్రియాంక, ముగ్గురు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, మరో ముగ్గురు బీజేపీయేతర పాలిత రాష్ట్రాల సీఎంలు, దేశవ్యాప్తంగా వివిధ ప్రతిపక్ష పార్టీల అధినేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఐదు కీలక గ్యారెంటీ పథకాల హామీల అమలును ఇదే వేదిక నుంచి సిద్ధరామయ్య ప్రకటించారు. 'ప్రజలు మా నుంచి ఆశించినవి మేం నెరవేరుస్తాం. ఎన్నికల ముందు ప్రకటించిన ఐదు కీలక గ్యారెంటీలను కేబినెట్ తొలి సమావేశంలోనే ఆమోదిస్తాం. వాటి అమలుకు ఆదేశాన్ని కూడా ఈరోజే జారీ చేస్తాం' అని సిద్ధరామయ్య వెల్లడించారు. సిద్ధరామయ్య, డీకే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు తరలిరావడంతో కంఠీరవ స్టేడియం కిక్కిరిసిపోయింది. సిద్ధరామయ్యకు, డీకేకు ప్రధాని మోదీ, మాజీ సీఎం బొమ్మై ట్విటర్‌లో అభినందనలు తెలిపారు.

## రూ. 2000 నోటు బంద్

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

చెలామణి నుంచి రూ. 2000 నోటును ఉపసంహరిస్తున్నట్లు భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) ప్రకటించింది. ఇక మార్కెట్‌లోకి కొత్తగా రూ.2000 నోట్లను విడుదల చేయడం లేదని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో ఆర్బీఐ ఒక పత్రికా ప్రకటనను విడుదల చేసింది. అలాగే కస్టమర్లకు రూ.2000 నోటును ఇవ్వొదని బ్యాంకులకు స్పష్టం చేసింది. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి రానుంది. మార్కెట్‌లో ఉన్న రూ.2000 నోటు మాత్రం చెలామణి ఉంటుందని ఆర్బీఐ పేర్కొంది. తాజా నిర్ణయం వల్ల ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేసింది. ఈనెల 23వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు కస్టమర్లు తమ వద్ద ఉన్న రూ.2000 నోట్లను బ్యాంకుల వద్ద డిపాజిట్ చేయొచ్చని లేదా వాటికి బదులు ఇతర నోట్లను తీసుకోవచ్చని పేర్కొంది. అయితే రోజుకు గరిష్ఠంగా రూ.20,000 విలువైన రూ.2000 నోట్లను మాత్రమే మార్చుకునేందుకు అనుమతించారు. అంటే పది నోట్లను మాత్రమే జమ చేయాల్సి ఉంటుంది. లేదా ఇతర నోట్లను తీసుకోవచ్చు. బ్యాంకులతో పాటు ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో కూడా ఈ సౌకర్యం ఉంటుందని పేర్కొంది. మార్చి 31 నాటికి జారీ చేసిన రూ.2000 నోట్లలో 10.8 శాతం మాత్రమే జనం వద్ద చెలామణిలో ఉన్నాయని ఆర్బీఐ పేర్కొంది. 2016 నవంబరులో రూ.2000 నోటును ప్రవేశ పెట్టిన ఆర్బీఐ...2018-19 నుంచే వీటి ప్రింటింగ్‌ను నిలిపివేసింది. ఆర్బీఐ తాజా నిర్ణయంతో వచ్చే సెప్టెంబర్ నెలాఖరు తరవాత రూ.2000 నోట్లను పూర్తిగా ఉపసంహరించినట్లు అవుతుంది.




## శ్రీవారి ఆర్జిత సేవలు, వీఐపీ దర్శనాల్లో స్వల్ప మార్పులు

**తిరుమల, నేటి పత్రిక ప్రజావార్త :**



వేసవి సెలవుల కారణంగా తిరుమలలో భక్తుల రద్దీ రోజురోజుకూ అనూహ్యంగా పెరుగుతోంది. సర్వదర్శనం భక్తులకు దాదాపు 30 నుంచి 40 గంటల సమయం పడుతోంది. శుక్ర, శని, ఆదివారాల్లో భక్తులు వేచి ఉండే సమయం ఇంకా ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో సామాన్య భక్తుల సౌలభ్యం కోసం జూన్ 30వ తేదీ వరకు స్వామి వారి సేవలు, వీఐపీ దర్శనాల్లో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్ర, శని, ఆదివారాల్లో సుప్రభాత సేవకు విచక్షణ కోటాను రద్దు చేశారు. తద్వారా 20 నిమిషాల సమయం ఆదా అవుతుంది. గురువారం తిరుప్పావడ సేవ ఏకాంతంగా నిర్వహించనున్నారు. తద్వారా 30 నిమిషాల సమయం ఆదా అవుతుంది. శుక్ర, శని, ఆదివారాల్లో వీఐపీ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరు. కేవలం స్వయంగా వచ్చే వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనం కల్పించడం జరుగుతుంది. తద్వారా ప్రతిరోజు మూడు గంటల సమయం ఆదా అవుతుంది. క్యూలైన్లలో గంటల తరబడి కిలోమీటర్ల మేర వేచి ఉండే వేలాది మంది సామాన్య భక్తులకు ఈ నిర్ణయాల వల్ల త్వరితగతిన స్వామివారి దర్శనం లభిస్తుంది.

**24న రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల**

తిరుమలలో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లకు సంబంధించి జూలై, ఆగస్టు నెలల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టీటీడీ https://tiru patibalaji.ap.gov.in లో దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ కోరుతోంది.

## మాతా వైష్ణో దేవి ఆలయం, హరిద్వార్ & రిషికేశ్ యాత్రకు 10 జూన్ 2023 నుండి బయలుదేరనున్న భారత్ గౌరవ్ రైలు

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**



దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో 'భారత్ గౌరవ్' రైలు ఉద్దేశం గొప్ప విజయాన్ని సాధించింది. ఇది కాశీ & పరిసర ప్రాంతాలకు ఇటీవలి ట్రిప్పుల స్థిరమైన 100% ఆకుపెన్సీతో ప్రయాణికుల నుండి మంచి ప్రోత్సాహం అందింది. రైలు ప్రయాణీకుల నుండి అనుకోనిరీతిలో విశేషమైన స్పందనతో రావడం వలన ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సిటిసి) భారతదేశంలోని ఇతర ప్రసిద్ధ మరియు ముఖ్యమైన యాత్రా స్థలాలను కవర్ చేసే భారత్ గౌరవ్ రైళ్ల నిర్వహణ కోసం కొత్త టూరిస్ట్ సర్క్యూట్‌ను ప్రణాళిక రూపొందించింది.

ఇందులో భాగంగా, ఐఆర్‌సిటిసి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుండి ప్రారంభమయ్యే "మాతా వశిహ్నో దేవి, హరిద్వార్ మరియు రిషికేశ్" భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు అనే కొత్త పర్యాటక ప్యాకేజీని ప్రకటించింది. ఈ రైలు , దేశంలోని ఉత్తర భాగంలోని ముఖ్యమైన యాత్రికులు మరియు చారిత్రక ప్రదేశాలను కవర్ చేస్తుంది. తెలంగాణ మరియు మహారాష్ట్రలోని ఏడు ముఖ్యమైన స్టేషన్లలో ప్రయాణికులు ఎక్కేందుకు/దిగే సౌకర్యాన్ని కల్పించింది .

"హరిద్వార్ & రిషికేశ్‌తో మాతా వైష్ణోదేవి" ప్రయాణించే ఈ టూరిస్ట్ సర్క్యూట్ రైలు తెలంగాణలోని సికింద్రాబాద్, కాజీపేట, రామగుండం మరియు సిర్పూర్ ఖగజ్‌నగర్‌లతో పాటు మహారాష్ట్రలోని బల్హార్షా, వార్ధా మరియు నాగ్‌పూర్‌లలో ప్రయాణికుల సౌలభ్యం కోసం ఎక్కేందుకు/దిగే సౌకర్యాన్ని కల్పించింది . ఈ రైలు కత్రా, ఆగ్రా, మధుర, బృందావన్, కత్రా, హరిద్వార్ మరియు రిషికేశ్ వంటి ముఖ్యమైన ప్రాంతాలను కవర్ చేస్తుంది. వైష్ణో దేవి ఆలయం కోసం కాట్రా నుంచి ఆలయానికి వెళ్లాలనుకునే పర్యాటకులు పోనీ/డోలీ/ హెలికాప్టర్ సర్వీస్ ద్వారా తమ వ్యక్తిగతముగా వారే బుక్ చేసుకోవాలి.

మొత్తం ట్రిప్ 8 రాత్రులు/9 పగల్లు కాల వ్యవధిలో కవర్ చేయబడుతుంది. ప్రయాణీకులకు తగిన రైళ్లు, వసతి, ఆహారం మొదలైన అన్ని సంబంధిత ఏర్పాట్లు చేయడం మరియు వ్యక్తిగతంగా ప్లాన్ చేయడంలో ఉన్న అన్ని ఇబ్బందులను నివారించి ఈ రైలు మంచి సౌకర్యం వసతులను పర్యాటకులకు కల్పిస్తుంది. ఇందులో అన్ని ప్రయాణ సౌకర్యాలు (రైలు మరియు రోడ్డు రవాణాతో సహా), వసతి సౌకర్యం, క్యాటరింగ్ ఏర్పాట్లు (ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్, లంచ్ మరియు డిన్నర్-ఆన్-బోర్డ్ మరియు ఆఫ్-బోర్డ్ రెండూ), ప్రొఫెషనల్ మరియు ఫ్రెండ్లీ టూర్ ఎస్కార్ట్‌ల సేవలు, భద్రత రైలులో (అన్ని కోచ్‌లలో అమర్చిన సిసిటివి కెమెరాలతో సహా), అన్ని కోచ్‌లలో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సౌకర్యం, ప్రయాణ బీమా మరియు సహాయం కోసం ప్రయాణం అంతటా ఐఆర్‌సిటిసి టూర్ మేనేజర్‌ల పర్యవేక్షణలో అందించడం జరుగుతుంది. మరిన్ని వివరాల కోసం ఐఆర్‌సిటిసి వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు: http://www.irctctourism.com , https://www.irctctourism.com/pacakage_description మరియు సికింద్రాబాద్ ఆఫీస్ ఫోన్ నంబర్‌లలో కూడా సంప్రదించవచ్చు: 9701360701, 8287932228, 9110712752

## 28న నూతన పార్లమెంటు భవనం ప్రారంభం

**- రూ. 970 కోట్ల అంచనా వ్యయంతో 64,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నాలుగు అంతస్తుల్లో నిర్మాణం**



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

రూ. 970 కోట్ల అంచనా వ్యయంతో 64,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నాలుగు అంతస్తుల్లో నిర్మించిన నూతన పార్లమెంటు భవనాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ఈనెల 28న ప్రారంభించే అవకాశం వుంది. దేశ ప్రజాస్వామ్య వారసత్వానికి ప్రతీకగా నిలిచేలా నిర్మించిన రాజ్యంగ మందిరంలో రాజ్యాంగం అసలు ప్రతిని ఉంచుతారు. అలాగే, 1,224 మంది ఎంపీలు కూర్చోనేలా హాలును తీర్చిదిద్దారు. ఈ నెల 28న దీనిని ప్రారంభించినా జులైలో జరిగే పార్లమెంటు శీతాకాల సమావేశాలు మాత్రం ఇందులో జరిగే అవకాశం లేదని సమాచారం. ఈసారి జీ-20 కూటమికి భారత్ సారథ్యం వహిస్తుండడంతో తొలుత 20 దేశాల పార్లమెంటు స్పీకర్లతో ఇక్కడ సమావేశం నిర్వహిస్తారు. సెంట్రల్ విస్టా పునర్నిర్మాణ ప్రాజెక్టులో భాగంగా 10 డిసెంబరు 2020లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పార్లమెంటు కొత్త భవనానికి శంకుస్థాపన చేశారు. త్రిభుజాకారంలో ఉండే ఈ పార్లమెంటు భవనం పనులు 15 జనవరి 2021న ప్రారంభమయ్యాయి. నిజానికి గతేడాది ఆగస్టులోనే పనులు పూర్తికావాల్సి ఉండగా కరోనా కారణంగా 9 నెలలు ఆలస్యమైంది. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తికాగా తుదిమెరుగులు దిద్దుతున్నారు. భవనంలోని మూడు ప్రధాన ద్వారాలకు జ్ఞాన, శక్తి, కర్మ అని పేర్లు పెట్టారు.

# ఊనగట్ల శ్రీ గోగులమ్మ అమ్మవారిని దర్శించుకున్న హెూం మంత్రి



**కొవ్వూరు, నేటి పత్రిక ప్రజావార్త :**

చాగల్లు మండలం ఊనగట్లలో కొలువైన గ్రామ దేవత శ్రీ గోగులమ్మ తల్లిని రాష్ట్ర హెూం మంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత శనివారం దర్శించుకున్నారు. గ్రామ సర్పంచ్ మట్టా వెంకట్రావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో హెూంమంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం గోగులమ్మ తల్లికి హెూంమంత్రి ప్రత్యేక పూజలు చేసి, దర్శనం చేసుకున్నారు. అమ్మవారి చల్లని చూపు ప్రజలందరి పై ఉండాలని మంత్రి ఆకాక్షించారు. గ్రామ పెద్దలు నాయకులు హెూం మంత్రిని శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఊనగట్ల గ్రామ ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# అండగా ఉంటాం, అధైర్యపడవద్దు



**తిరుపతి, నేటి పత్రిక ప్రజావార్త :**

అండగా ఉంటాం, అధైర్యపడవద్దు ఇప్పటికే మంటలు జరిగిన వాటి నమూనాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాము త్వరలో కారణాలు తెలుస్తాయి తదుపరి ఏమి చేయాలన్నది చేద్దాం అని తిరుపతి చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మధ్యాహ్నం చంద్రగిరి నియోజకవర్గం కొత్త శానంబట్లలో చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, అడిషనల్ ఎస్.పి. వెంకటరావు, అధికారులు పర్యటించారు. శాసనసభ్యులు మాట్లాడుతూ గత వారంగా గ్రామంలో అక్కడక్కడ మంటలు చెలరేగుతున్న వాటిపై ఇప్పటికే నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపామని త్వరలో నివేదిక రానున్నదని, మానవ తప్పిదమో, ఆచార సంప్రదాయాల వల్ల జరిగిందా తెలుస్తుందని, రిపోర్టు రాగానే తక్షణ సహాయ చర్యలు చెప్పడానికే నేడు జిల్లా కలెక్టర్ గారు కూడా పర్యటించారు. పగలే మంటలు చెలరేగడం జరుగుతున్నది, భయాందోళన లేకుండా అండగా గ్రామంలో మహిళా పోలీసులు 18 మందిని ఇక్కడే ఉంచుతామని అన్నారు. ఇప్పటికే మంటలు చెలరేగిన ఇండ్ల వద్ద పోలీసులు సి.సి. కెమరాలు ఏర్పాటు, పర్యవేక్షణ చేస్తున్నారని అన్నారు. అపోహలు, వదంతులు నమ్మవద్దు త్వరలో కారణాలు తెలుస్తాయి, మరో గ్రామంలో ఇలా జరగకుండా జాగ్రత్త పాడుదాం అన్నారు. గ్రామంలో రూ.3.38 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు రోడ్లు, డ్రైనెజ్ , కమ్యూయునిటీ హాలు, పశు వైద్యశాల, ఆర్.ఓ. ప్లాంటు ఏర్పాటు తక్షణం ప్రారంభమవుతున్నాయి అన్నారు. గ్రామంలో భాదితులు అయిన అరుణ, రాణి, గోపికృష్ణ గృహాలు సందర్శించి జరిగిన విధానం అడిగి తెలుసుకున్నారు, దైర్యం చెప్పారు. ఈ పర్యటనలో ఆర్డీఓ కనక నరసారెడ్డి, పర్యావరణ ప్రొఫెసర్ దామోదర్, ఫైర్ అధికారి రమణయ్య, పోలీసు అధికారులు, స్థానికులు ఉన్నారు.

# ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 24వ డివిజన్ తరిమిల నాగిరెడ్డి వీధిలో రూ. 17 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి శనివారం ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ ప్రజల కనీస అవసరాలను తీర్చడంలో గత చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వం పోతుపోతూ పెద్దఎత్తున సమస్యలు వదిలివెళ్లిందని.. వాటన్నింటినీ సవాలుగా తీసుకుని ప్రతి ఒక్క ప్రాంతాన్ని ఈ ప్రభుత్వం అభివృద్ధి పరుస్తున్నట్లు వెల్లడించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఈ ప్రాంతంలో పెనుమార్పు వచ్చిందని వెల్లడించారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా.. సెంట్రల్ ను అభివృద్ధిలో మేటిగా నిలిపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మల్లాది విష్ణు తెలియజేశారు. కార్యక్రమంలో డీఈ(ఇంజనీరింగ్) గురునాథం, డీఈ(యూజీడీ & వాటర్ సప్లై) రామకృష్ణ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# మైగ్రేన్‌కు ఉత్తమమైన వైద్యం యోగ శక్తి చికిత్స

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**



కానూరు అశోక్‌నగర్‌లోని ఇండియన్ ఓమ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన మైగ్రేన్ చికిత్స అవగాహన సదస్సులో పలువురికి సేవలు అందించినట్టు యోగశక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. సమాజంలో చాలామంది ఈ వ్యాధితో బాధపడుతున్నారని దీనిని భారతీయ సాంప్రదాయ వైద్యం యోగశక్తి చికిత్స అత్యుత్తమ ఫలితాలు ఇచ్చిందని తెలిపారు. మందులు వాడకుండా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని ఈ వైద్యం ప్రపంచంలో రెండవ అతిపెద్ద వైద్యంగా పెరిగిందని తెలిపారు బ్రహ్మనాడి సహస్రారంను ఒత్తిడి ఇవ్వడం, కన్నుపై ఉన్న జీబి 14, ఎస్టి 8, నాడి కేంద్రంలో నొక్కడం ద్వారా వ్యాధి తీవ్రత తగ్గుతుందని తెలిపారు. ఇకముందు ఈ వ్యాది రాకుండా చేయడానికి ఆహార నియమాలు పాటించాలని, తెలిపారు. ఉదయం ఏడు(7) గంటల లోపు ఆల్కలైన్ ప్రోటీన్ తినాలని మధ్యాహ్నం ఒంటిగంట (1.00) లోపు కార్బోహైడ్రేట్స్ తినాలి, రాత్రి 8 గంటలకు జావా మరియు ఫ్రూట్స్ తీసుకోవాలని తెలిపారు. రోజు యోగ సాధన చేయడం ద్వార జీవితకాలం ఈ వ్యాధి బారిన పడకుండా ఉపయోగపడుతుందని డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు.

# పట్టాలు పంపిణీ చేసిన వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలి

## : సీఎం వైఎస్ జగన్

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**



క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్డీఏ) పరిధిలో పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇళ్ల పట్టాల పంపిణీ పూర్తి కాగానే నిర్మాణాలు మొదలు పెట్టాలన్నారు. గురువారం ఆయన తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై సమీక్ష నిర్వహించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో అధికారులు పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పేదలకు ఎంత త్వరగా పక్కా ఇళ్లను సమకూరిస్తే వారి జీవితాలు అంత త్వరగా బాగు పడతాయన్నారు. సీఆర్డీఏ పరిదిలో పేదలకు పంపిణీ చేస్తున్న స్థలాల్లో వేగంగా పనులు చేపట్టాలని చెప్పారు. రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలందరికీ సాధ్యమైనంత త్వరగా ఇళ్లు కట్టించి అప్పగించడమే లక్ష్యంగా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం పురోగతిని అధికారులు సీఎంకు వివరించారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం గత 45 రోజుల్లో రూ.1,085 కోట్లు ఖర్చు చేసిందని, ఇప్పటికే 3.69 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. రూఫ్ లెవల్, ఆపై దశలో ఉన్న ఇళ్ల త్వరలోనే పూర్తి అవుతాయన్నారు. మరో 8.64 లక్షల ఇళ్లు బేస్‌మెంట్ ఆపై దశల్లో ఉన్నాయన్నారు. వీటి పనులనూ వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. గత సమీక్షలో సీఎం జారీ చేసిన ఆదేశాలను అమలు చేశామని తెలిపారు. 'జగనన్నకు చెబుదాం' స్పెషల్ ఆఫీసర్లను కూడా వైఎస్సార్, జగనన్న కాలనీల్లో నియమించి, ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్నామని వెల్లడించారు. ఇళ్ల నిర్మాణానికి వాడే వస్తువుల నాణ్యతపై ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తున్నామని వివరించారు. ఇళ్ల లబ్ధిదారులైన మహిళలకు మరింత భరోసాగా బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం అందేలా చూస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. ఇలా ఇప్పటి వరకూ 11.03 లక్షల మందికి పావలా వడ్డీతో రూ.35 వేల చొప్పున రుణాలిప్పించామని.. రూ.3,886.76 కోట్ల మేర రుణాలు మంజూరు అయ్యాయని తెలిపారు. సీఆర్డీఏలో ప్రాంతంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీకి అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, భూమి చదును చేసే పనులు చేశామన్నారు. ఈ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలతో నిర్మాణం పూర్తయిన 5,024 టిడ్కో ఇళ్లను కూడా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఏపీ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్ జైన్, శ్రీలక్ష్మి, విజయానంద్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ సాయి ప్రసాద్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సత్యనారాయణ, సీసీఎల్ఏ సెక్రటరీ ఇంతియాజ్, ఏపీ టిడ్కో ఎండీ సీహెచ్ శ్రీధర్, గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీషా, మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ వెంకటరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, అక్రమ రవాణాను అరికట్టేందుకు శిక్షణా కార్యక్రమం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**



బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, అక్రమ రవాణా ను అరికట్టేందుకు వాసవ్య మహిళా మండలి వారు కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సహకారంతో యన్.టి.ఆర్ మరియు కృష్ణాజిల్లాలలో పనిచేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నామని అందులో భాగంగా సిబ్బందికి శిక్షణా కార్యక్రమం జరిగిందని సంస్థ అధ్యక్ష్యులు డాక్టర్ బొల్లినేని కీర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పి. రాజారామ్ నాల్గవ ఆడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది అందరూ ఒక మంచి పని చేయడానికి ముందుకు వచ్చినందుకు అందరికీ కృతజ్ఞతలను తెలియజేస్తున్నానని రేపటి భావి పౌరుల జీవితాలు ఆణగారి పోకుండా ఉండేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బాల్య వివాహాలు జరగడానికి గల ముఖ్య కారణం పెద్దల అజ్ఞానం అని కుటుంబంలో ఆనారోగ్యంతో ఉన్నవారు చివరికోరిక తీర్చడానికని, మరలా ఇలాంటి సంబందం మళ్ళి రాదు అని ఇలా అనేక కారణాలు చెప్పి బాల్య వివాహాల వైపు మొగ్గు చూపుతున్నారని తద్వారా బాలికల జీవితాంతం అనేక ఆరోగ్య, సామాజిక సమస్యలను ఎదుర్కొనుచున్నారని ఆయన అన్నారు. కావున ముందు తల్లిదండ్రులు ధోరణి మారాలని లేని పక్షంలో వెళ్ళి కొడుకు వారి తల్లిదండ్రులతో పాటు వివాహానికి వచ్చిన బంధువులకు కూడా రెండు సంవత్సరాలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. న్యాయం పొందడం ప్రతీ ఒక్కరి ప్రాథమిక హక్కు కావున ఎవరికైనా న్యాయ సలహాలు, సహకారం అవసరమైతే ఉచితంగా సేవలను కూడా పొందవచ్చు అని ఆయన అన్నారు. ఆనుతరు యన్.టి.ఆర్ జిల్లా ఎ.సి.పి ఏ.వి నాయుడు మాట్లాడుతూ లీగల్, మెడికల్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి అన్నారు. సమాజానికి ఇబ్బంది కలిగించే వ్యక్తులను సమాజానికి దూరంగా ఉంచాలని ఆయన అన్నారు. దిశ యాప్ ను ప్రతిఒక్కరూ కలిగి ఉండాలని ఆయన అన్నారు. మహిళల అక్రమ రవాణా వై ఆరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని మీకు తెలిసిన సమాచారాన్ని పోలీసు తెలియజేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి జి.రశ్మి, కార్యదర్శి వాసవ్య మహిళా మండలి, రాధా కుమారి, సి.డబ్ల్యుసి సభ్యులు,సాయి గీతిక ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, చంద్రశేఖర్ బచవన్ అందోలన్ బచావో స్టేట్ కొఆర్డినేటర్, జాన్సన్, ఐ.సి.పి.యస్ వాసవ్య సిబ్బంది పాల్గొన్నారు

# ధర్మాత్ములకు ఆంజనేయుడి రక్ష

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**



ధర్మాన్ని ప్రమాణంగా తీసుకుని జీవనం కొనసాగించేవారికి హనుమంతుడు సర్వదా రక్షగా నిలుస్తారని ప్రవచనా సార్వభౌమ బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. మల్లాది వెంకట సుబ్బారావు-సుందరమ్మ చారిటబుల్ ట్రస్టు అధ్వర్యంలో సత్యనారాయణపురం ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రాంగణంలో హనుమత్ వైభవంపై చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం తొలిరోజు శనివారం భక్తులను సమ్మోహితులను చేస్తూ సాగింది. ఎవరైతే రామచంద్రుడి పట్ల, ధర్మం పట్ల భక్తి ప్రపత్తులతో ఉంటారో వారు హనుమంతుడిని ప్రత్యేకంగా పూజించాల్సిన అవసరం లేదన్నారు. సమాజ హితం కోసమే తన ప్రతి కార్యం హనుమ చేశారన్నారు. మానవ జీవితానికి గొప్ప స్ఫూర్తి హనుమంతుడన్నారు. హనుమంతుడు గొప్ప యోగి అని, ఆయన నడవడిక ధ్యాన యోగా సాధకులకు మార్గదర్శకమన్నారు. హనుమంతుడిని ఆరాధిస్తే వాక్కు పట్ల విశేషమైన పట్టు సాధించవచ్చన్నారు. ముందుగా చిన్నారులచే ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం హనుమాన్ చాలీసా పఠనం నిర్వహించారు. చాగంటి కోటేశ్వరరావును ఎమ్మెల్యే మల్లాది విష్ణు పూలమాల, శాలువాతో సత్కరించారు. పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, దుర్గగుడి ఛైర్మన్ కర్నాటి రాంబాబు, కార్పొరేటర్ కొండాయగుట్ట మల్లేశ్వరి బలరాం, మల్లాది రాజేంద్ర, మల్లాది శ్రీనివాస్ పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉర్దూ అకాడమీ సభ్యులుగా ముగ్గురు నియామకం

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ బోర్డు సభ్యులుగా ముగ్గురుని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జిల్లాకు చెందిన షేక్ అబ్దుల్ కలీం, కృష్ణా జిల్లాకు చెందిన షేక్ దిల్షాద్ నజరానా మరియు నంద్యాల జిల్లాకు చెందిన ఎస్ ముర్తజ్వలీ లను సభ్యులుగా నియమిస్తూ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ. ఎండి ఇమ్తియాజ్ జి.ఓ.ఆర్టి.సంఖ్య.122 ను మే 17 న జారీచేశారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ బోర్డు సభ్యులుగా వీరు పదవీ భాద్యతలు చేపట్టిన నాటి నుండి రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతారని ఆ ఉత్తర్వులలో పొందుపర్చడమైనది.

# గాజువాకలోని హైస్కూల్‌ను సందర్శించి తనిఖీ చేసిన ప్రవీణ్ ప్రకాష్



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

రాష్ట్ర ప్రభుత్వం గతేడాది "జగనన్న విద్యాకానుక" క్రింద అందించిన షూ నంబర్, ఏఎమ్ డి సైజ్ ఈ ఏడాది అందించే వాటితో సరిపోలడం లేదని వచ్చిన ఫిర్యాదుల మేరకు పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ స్పందించి విశాఖపట్నం జిల్లా గాజువాకలోని హైస్కూల్ ను సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యాదృచ్ఛికంగా 9వ నెంబర్ షూ జత తీసుకొని వేసుకోవడానికి ప్రయత్నించిన ఆయన తను పరీక్షించిన షూ పొడవు 27-28 సెం.మీలు ఉందని చెప్పారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు ప్రభుత్వ ప్రతినిధులు నేరుగా శాంపిల్స్ ను పరీక్షించడం దేశంలో సాధారణ విషయమే అన్నారు.

# పదవ తరగతి పాసైన వారికీ ఐటిఐలో షార్ట్ టర్మ్ కోర్సులు

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

పదవ తరగతి పాసైన విద్యార్థులకు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో స్వల్పకాలిక కోర్సులలో అవకాశం కల్పించేందుకు ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ యం. కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద ఎలిక్ట్రిషియన్, డొమెస్టిక్ సోలుషన్స్ మరియు ప్లంబ్బర్ జనరల్ కోర్సులను స్వల్ప కాలిక ప్రాతిపదికన అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. 4 నెలల పాటు శిక్షణ అందించే స్వల్ప కాలిక కోర్సులను పూర్తీ చేసుకున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం వారిచే సర్టిఫికెట్ మంజూరు చేయడం జరుగుతుందని కోర్సును అభ్యసించే సమయంలో విద్యార్థులకు బస్సు పాస్ సౌకర్యం కల్పిస్తామన్నారు. షర్ట్ టర్మ్ కోర్సులో చేరేందుకు ఆసక్తి కలిగి పదవ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు విజయవాడ గవర్నమెంట్ ఐటిఐ కార్యాలయం నందు స్వయంగా గాని, 0866 2475575 లేదా 9963040678/9951281278 నందు సంప్రదించాలని యం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు.

# రోగులకు మరింత మెరుగైన సేవలు డిప్యూటీ సీఎం కొట్టు

**తాడేపల్లిగూడెం, నేటి పత్రిక ప్రజావార్త :**

తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవదాయ ధర్మదాయ శాఖామంత్రి కొట్టు సత్యనారాయణ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం ఏరియా ఆసుపత్రి కార్యకలాపాలపై మంత్రి కొట్టు సమీక్షించారు. దీనికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పగడాల సూర్యనారాయణ ఇంచార్జ్ ఆర్ఎంఓ డాక్టర్ నాయక్ హాజరయ్యారు. ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన పది పడకలతో కూడిన చిన్నపిల్లల స్పెషల్ వార్డు ఎస్ఎన్‌సియు పూర్తయిందని వారు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కోటి 40 లక్ష రూపాయలు వ్యయంతో ఏర్పాటు చేస్తున్న జిల్లాస్థాయి ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్ పూర్తి కావచ్చిందన్నారు. త్వరలోనే వీటిని రోగులకు అందుబాటులోకి తీసుకు రావాలని మంత్రి ఆదేశించారు. ఖాళీగా ఉన్న శానిటేషన్ సూపర్వైజర్ పోస్టు భర్తీ చేయడంతో పాటు సెక్యూరిటీ గార్డ్ పోస్టుకూడా త్వరలోనే భర్తీ చేయాలని సూచించారు. ఆసుపత్రి పురోభివృద్ధికి ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొండి బకాయిలు వసూళ్లకు చొరవ చూపించాలన్నారు. ఇప్పటికే నాలుగున్నర లక్షల రూపాయలు వసూలు చేశామని మరో నాలుగున్నర లక్షల రూపాయలు వసూలు చేయవలసి ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యనారాయణ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ జి ఆర్ రెడ్డి విరాళంతో ఆసుపత్రికి రెండు ఫ్రీజర్ బాక్సులు సమకూరాయని వీటిని త్వరలోనే ఉచిత సౌకర్యార్థం అంకితం చేయనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం త్వరలో ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యనారాయణ ను ఆదేశించారు. వివిధరకాల వైద్య సేవలో ఆసుపత్రి ప్రగతిని మంత్రికి నివేదించారు.



# జగనన్న ప్రభుత్వాన్ని నిలబెట్టుకుందాం కొత్తూరు ప్రజలకు మంత్రి కొట్టు



**తాడేపల్లిగూడెం, నేటి పత్రిక ప్రజావార్త :**
మనకు సాయపడేదెవరు ఉపయోగపడేది ఎవరు? అనేది ఆలోచించుకుని నిర్ణయం తీసుకోవాలని స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. గత నాలుగేళ్లుగా అనేక సంక్షేమ పథకాలతో మన కుటుంబాలకు లక్షలాది రూపాయలు ఆర్థిక సహాయం అందించిన జగనన్న ప్రభుత్వాన్ని నిలబెట్టుకుందామని కొత్తూరు గ్రామ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం రూరల్ మండలం కొత్తూరు గ్రామంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో సైతం కొత్తూరు గ్రామ ప్రజలు మాయమాటలు నమ్మి మోసపోయారన్నారు. అయినప్పటికీ వైకాపా ప్రభుత్వం లో ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ఈ గ్రామంలో ప్రతి ఒక్క కుటుంబం లక్షల రూపాయలు లబ్ధి పొందింది అన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ఇలాంటి ముఖ్యమంత్రిని నిలబెట్టుకోవాల్సిన అవసరం మన అందరి పైన ఉందన్నారు. మాయ మాటలు అబద్ధాలు మోసపుచ్చేవారిని నమ్మితే నట్టేట మునిగిపోతామని నష్టపోతామని మంత్రి కొట్టు సత్యనారాయణ హెచ్చరించారు. ఈసారి కచ్చితంగా అలా చేస్తారని నమ్మకం కలుగుతుంది అన్నారు పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు వైకాపా ప్రభుత్వం జగనన్న ఇంటి కోసం ఇస్తున్న సెంటు స్థలాన్ని స్మశానానికి కూడా సరిపోదని వ్యాఖ్యానించడం చంద్రబాబు పైశాచికత్వానికి నిదర్శనమని మంత్రి కొట్టు విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రతి కుటుంబానికి వైకాపా ప్రభుత్వంలో జగనన్న సంక్షేమ పథకాల ద్వారా అందిన ఆర్థిక లబ్ధిని గణాంకాలతో సహా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి మండల వైకాపా కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్ మండల వైకాపా అధ్యక్షుడు కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్ర కుమార్ పంచాయతీ కార్యదర్శి విఆర్ఓ సచివాలయం ఉద్యోగులు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రతి నిరుపేద కుటుంబానికి ఇల్లు ఇచ్చి తీరుతాం

: హోం మంత్రి తానేటి వనిత



**కొవ్వూరు, నేటి పత్రిక ప్రజావార్త :**
బడుగు, బలహీన వర్గాల ప్రజలను కించపరచేలా మీకిచ్చే సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోతుందంటూ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర హోంమంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డా. తానేటి వనిత ఖండించారు. శనివారం కొవ్వూరులో హోంమంత్రి క్యాంపు కార్యాలయం నుండి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలకు నిరసనగా ర్యాలీని ఆమె ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్లు అందించి ఆంధ్రప్రదేశ్‌లో ఇళ్లు లేని పేదలు ఉండరాదనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళలో 32 లక్షల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని వివరించారు. ఈ సందర్భంగా తానేటి వనిత మాట్లాడుతూ.. చంద్ర బాబు నాయుడు పేదల ఇంటి స్థలాలను స్మశాన వాటికలతో పోల్చడాన్ని ఖండించారు. ఆయనకు పేదలపై ఉన్న అగౌరవం, హేయమైన భావాన్ని చంద్రబాబు వ్యాఖ్యలు అద్దంపడుతున్నాయన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం ప్రతిపక్ష నేతకి ఏమాత్రం ఇష్టం లేదని, అందుకే సెంటు స్థలాలు అంటూ సమాధులు కట్టుకోవడానికే ఉపయోగపడతాయని వెటకారాలాడుతున్నారని తెలిపారు. ఈ విషయం గ్రహించే ఆ ఫ్రస్టేషన్‌లో చంద్రబాబు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని.. వెంటనే బడుగు, బలహీన వర్గాలపై ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని హోంమంత్రి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ.. ఆయనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున వైఎస్సార్సీపీ నాయకులు నినాదాలు చేశారు. ప్రజలకు చంద్రబాబు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# పర్యావరణహిత జీవనశైలి అలవర్చుకోవాలి : జిల్లా కలెక్టర్



**మంగినపూడి బీచ్, నేటి పత్రిక ప్రజావార్త :**
భావితరాలకు మెరుగైన జీవితాలను అందించడానికి ప్రతి ఒక్కరూ పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మిషన్ లైఫ్ 2023 కార్యక్రమంలో భాగంగా మంగినపూడి సముద్ర తీరం వద్ద ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ లైఫ్ 2023 కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలో అన్ని మండలాల్లో మిషన్ లైఫ్ పేరిట 75 పర్యావరణ విభాగాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వాటిలో ముఖ్యంగా ఏడు విభాగాలైన నీటి పొదుపు, విద్యుత్ పొదుపు, వ్యర్థాలు తగ్గింపు, ఈ-వ్యర్థాల తగ్గింపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, సస్టైనబుల్ ఫుడ్ సిస్టమ్, హెల్తీ లైఫ్ స్టైల్ వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని వివరిస్తూ ఆహారం దొరక్క పశువులు నిత్యం ప్లాస్టిక్ ని ఆహారంగా తీసుకుని అనారోగ్యం పాలవుతున్నాయని ఇది ఎంతో బాధాకరమన్నారు. ఒకసారి వాడి పారేసిన ప్లాస్టిక్ భూమిలో కలవడానికి ఎన్నో ఏళ్లు పడుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్లాస్టిక్ నిషేధాన్ని స్వచ్ఛందంగా పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవితం కోసం ఈ అలవాట్లు ఎంతో అవసరం అన్నారు. ఇక నుంచి ప్రతివారం సముద్ర తీర ప్రాంతంలో చెత్తను శుభ్రపరుచుకునేలా ప్రణాళికలు రూపొందించి పక్కా చెత్తకుండీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పర్యావరణ భద్రత మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. అనంతరం బెల్, ఉయ్యూరు షుగర్ ఫ్యాక్టరీ, సంధ్య ఆక్వా, గ్రామ సచివాలయ ఉద్యోగులతో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, బందరు డివిజన్ రెవెన్యూ అధికారి ఐ.కిషోర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు పర్యావరణ ఇంజనీరు టి. ప్రసాద రావు, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర రావు, సహాయ పర్యావరణ ఇంజనీరు కే.జ్యోత్స్న శ్రీ, భద్రత మరియు బాధ్యత ఫౌండేషన్ నిర్వాహకులు బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనల ద్వారా రైతాంగానికి పూర్తి స్థాయి భరోసా

-మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనల ద్వారా రాష్ట్రంలోని రైతాంగానికి పూర్తి స్థాయి భరోసా కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహనరెడ్డికి దక్కుతుందని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి పేర్కొన్నారు. గత 4 ఏళ్లుగా యేటా ఆహార ధాన్యాల ఉత్పత్తి సుమారు 15 లక్షల టన్నుల మేర పెరుగుదల కనిపించడం, 15.6 శాతం తో పండ్ల ఉత్పత్తిలో దేశం లో ప్రథమ స్థానం పొందడమే ఇందుకు సాక్ష్యమని ఆయన అన్నారు. సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో "డిప్లొమా ఇన్ జర్నలిజం" విద్యార్థుల్ని, రాష్ట్రవ్యాప్తంగా జూమ్ లింక్ ద్వారా అనుసంధానమైన వర్కింగ్ జర్నలిస్టుల్ని ఉద్దేశించి శనివారం ప్రత్యేక ప్రసంగం చేశారు. 'రైతు' తన అవసరాలు, సందేహాలు, సమస్యలు స్వయంగా పరిష్కరించుకునే విధంగా రైతుకు సాధికారిత కల్పించామన్నారు. ఇందుకు అన్ని స్థాయిల్లోనూ, తగు సంస్థాగతమైన సంస్కరణల్ని చేపట్టి విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో వినూత్నంగా ప్రారంభించిన పలు పనుల వివరాలు ఆయన వివరించారు. రాష్ట్రంలో ప్రతి గ్రామ సచివాలయానికి అనుబంధంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల(ఆర్.బి.కె) ద్వారా 'సింగల్ విండో' విధానంలో రైతులకు అవసరమైన అన్ని సేవలు అందిస్తున్నామన్నారు. ఆర్.బి.కె ఛానెల్ ద్వారా రైతుల సందేహాల పై వ్యవసాయ శాస్త్రవేత్తలు నేరుగా మాట్లాడి సందేహాలు నివృత్తి చేసే విధంగా యేర్పాటు చేశామన్నారు. రైతు అవసరాలకు తగ్గట్టుగా ఆయా యంత్ర పరికరాల్ని వినియోగించుకునేందుకు రైతులకోసం ఒక ప్రత్యేక 'యాప్', అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు, కౌలు రైతులకు ప్రత్యేక కార్డులు, పంటల భీమా, రైతు భరోసా పి.ఎం. కిసాన్ పథకాలు, ప్రకృతి విపత్తులకు తట్టుకుని నిలిచే నాణ్యమైన వంగడాలు, డ్రోన్ టెక్నాలజీ, సాయిల్ హెల్త్ కార్డులు తదితరాలు రూపొందించామన్నారు. ఈ అవగాహనా సదస్సుకు సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు అధ్యక్షత వహించారు. సమావేశంలో డిప్లమో ఇన్ జర్నలిజం కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఎల్.వి.కె. రెడ్డి, కంటెంట్ ఎడిటర్ కలమండ శరత్ బాబు లు పాల్గొన్నారు. అంతకు ముందు "వివిధ మాధ్యమాలకు రాయడంలో జాగ్రత్తలు" అనే అంశం పై సీనియర్ పాత్రికేయులు పామిడికాల్వ మధు ప్రత్యేక ప్రసంగం చేశారు.

# ట్రాన్స్ జండర్లల భద్రతా రక్షణకు 'స్వాభిమాన్'




**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
సిఐడి డిపార్ట్మెంట్ గుంటూరు కార్యాలయంలో ఈరోజు సిఐడి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఐపీఎస్ ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్‌ల భద్రత, రక్షణ కోసం ఏర్పాటు చేసిన 1091 హెల్ప్‌లైన్‌ను మహిళా కమిషన్ చైర్పర్సన్ వాసిరెడ్డి పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్‌లను హేళన చేయడం, వారిని అవమానించడం, వారి వైకల్యాన్ని రాజకీయ పరిభాషలో ఎదుటివారిని తిట్టడానికి తిట్టుగా ఉపయోగించడం చాలా బాధాకరం అన్నారు. ట్రాన్స్ జెండర్‌ల భద్రతకు, రక్షణకు హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీరు కూడా ప్రేమ పేరుతో మోసపోవడం దీంతో చాలామంది ఆత్మహత్యలు, హత్యలకు గురవుతున్నారన్నారు. వాటిని నిరోధించడం వారి సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ అన్నారు. ఈ హెల్ప్‌లైన్ ద్వారా వారికి అవసరం అయితే సిఐడి డిపార్ట్మెంట్ వారు కౌన్సిలింగ్ కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ట్రాన్స్ జెండర్‌లకు కూడా ఆత్మాభిమానం ఉంటుందన్నారు. అందుచేతనే ఈ హెల్ప్ లైన్ పేరును 'స్వాభిమానం'గా నామకరణం చేయడం జరిగిందన్నారు. వారిని వారు సంస్కరించుకుంటూ ప్రభుత్వ, పోలీస్, స్వచ్ఛంద సంస్థల సహకారం పొందాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, వారి సమస్యలను అధిగమించాలని సూచించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ జెండర్‌ల గ్రూప్ లీడర్లకు వివరించడం జరిగింది. అనంతరం ఎస్పీ సిఐడి హర్షవర్ధన్‌రాజు ఐపీఎస్, ఎస్పీ సరిత (ఉమెన్ వింగ్), తదితరులు ప్రసంగించారు. ట్రాన్స్ జండర్ల అనుమానాలను నివృత్తి చేస్తూ వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను వివరించారు. అనంతరం ఎస్పీ సిఐడి డిపార్ట్మెంట్, ఎస్పి కే.వీ జీ సరిత, ప్రకాష్‌రెడ్డి డైరెక్టర్ డిజేబుల్ అండ్ ట్రాన్స్ జెండర్స్ పర్సన్స్, డాక్టర్ కామేశ్వర్ ప్రసాద్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏపీ ఎస్సే సి ఎస్, సత్యవతి ఫౌండర్ ఉమెన్స్ భూమిక, రచన ముద్రబోయిన రిసోర్స్ పర్సన్, అపర్ణ రీజనల్ కోఆర్డినేటర్ విహెచ్ఎస్, మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి మనోరంజని తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
పేద ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటున్న ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమే అని తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి దేవినేని అవినాష్ అన్నారు. పేదవారికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందని పక్షంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం చేస్తున్నామని తెలిపారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీ అమలు చేసిన ఘనత సీఎం జగన్ సొంతమని అయన పేర్కొన్నారు.ఒకపక్క వైస్సార్సీపీ ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం కోసం కోట్ల రూపాయలు నిధులు ఖర్చు పెడుతుంటే ఆరోగ్యశ్రీ నిధులు నిలిపేశారు అని ప్రతిపక్షాలు వారి అనుకూల మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని అది వాస్తవం కాదని అన్నారు. తూర్పు నియోజకవర్గంలో టీడిపి నేతలు ప్రభుత్వం పై విష ప్రచారం చేయటమే పనిగా పెట్టుకున్నారు అని, వారి మాయ మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు అయన విమర్శించారు. గుణదలలోని వైసీపీ తూర్పు నియోజకవర్గం కార్యాలయంలో 11వ డివిజన్‌కి చెందిన జలగం శాంతకుమారికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద లక్ష రూపాయలు చెక్కును నియోజకవర్గ ఇంచార్జి దేవినేని అవినాష్ అందజేశారు. ఈ సంధర్బంగా అవినాష్ మాట్లాడుతు పేదవారికి ఆరోగ్యశ్రీ ద్వారా సహాయం అందని పక్షంలో వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకోవడం జరుగుతుందని చెప్పారు. సీఎం జగన్ పాలనలో ఏ ఒక్క పేదవాడికి అన్యాయం జరగకుండా అండగా నిలుస్తున్నామన్నారు. సంక్షేమపథకాలని నేరుగా లబ్ధిదారుల గుమ్మం వద్దకు చేరుస్తున్నామన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఇప్పటికే కోట్లాది రూపాయలు అందచేసినట్లు అవినాష్ చెప్పారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు బుద్ధి తెచ్చుకొని హుందాగా ప్రవర్తించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు,డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కొరివి చైతన్య,సొంగా రాజ్‌కమల్, వైస్సార్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రజల జీవన శైలిలో మార్పు రావాలి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
పర్యావరణ పరిరక్షణలో భాగంగా మేరీ లైఫ్-మేరా స్వచ్ఛ షహార్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్ రీసైకిల్ రియూజ్) వాహనానం ద్వారా సేకరించిన వ్యర్థాలను పునర్వినియోగంతో పాటు ఉపయోగంలోనికి తీసుకురానున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. ప్రపంచ పర్యావరణాన్ని పురస్కరించుకుని మేరీ లైఫ్-మేరా స్వచ్ఛ షహార్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్ రీసైకిల్ రియూజ్) వాహనాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు శనివారం ఆయన విడిది కార్యాలయం వద్ద ప్రారంభించి ఆయన గృహంలో నిరుపయోగంగా ఉన్న వస్తువులను మున్సిపల్ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రజల జీవన శైలిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ట్ వాడకాన్ని తగ్గించిన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటు చేసినవారమవుతామన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ పద్ధతిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. తక్కువ వినియోగం (రెడ్యూస్) పునర్వినియోగం (రియూజ్) శుద్ధి చేసి వినియోగం (రీసైకిల్) విధానాలు వ్యర్థాల నివారణకు స్థిరమైన అభివృద్ధికి బాటలు వేస్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణ ద్వారానే సురక్షితమైన త్రాగు నీరు, పరిశుభ్రమైన నేల, మంచి గాలి ప్రజలకు అందుతాయన్నారు. రాబోయే రోజుల్లో విజయవాడ నగరాన్ని జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చే విధంగా ప్రజలు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు కోరారు.

నగరపాలక సంస్థ మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్ మాట్లాడుతూ నగరంలో 67 ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేసి మే 20వ తేది నుండి జూన్ 5వ తేది వరకు ఉదయం 7:00 గంటల నుండి మధ్యహ్నాం 1:00 గంట వరకు ప్రజల వద్ద నిరుపయోగంలో ఉన్న వస్తువులను సేకరించనున్నట్లు ఆయన తెలిపారు. దీనితో పాటు ఆర్‌ఆర్‌ఆర్ ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజల వద్ద ఆర్థిక మొత్తంలో నిరుపయోగంలో ఉన్న పాత పుస్తకాలు, పాత దుస్తువులు, పాత షూస్, ప్లాస్టిక్ వ్యర్థాలు, పూల వ్యర్థాలు, ఎలక్ట్రానిక్, వస్తువులు ఉన్నట్లైయితే 8181960909 నెంబర్‌కు ఫోన్ చేస్తే ఇంటివద్దకే ఆర్‌ఆర్‌ఆర్ వాహనాన్ని పంపి నిరుపయోగంలో ఉన్న వస్తువులను సేకరించడం జరుగుతుందన్నారు. సేకరించిన వాటిలో ఉపయోగపడే వస్తువులను స్వచ్ఛంద సంస్థల ద్వారా పేదలకు ఉచితంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమీషనర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, శాసనమండలి సభ్యులు యండి రుహుల్లా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటి మేయర్లు అవుతూ శ్రీ శైలజారెడ్డి, బెల్లం దుర్గ, సబ్ కలెక్టర్ అదితిసింగ్, నగరపాలక సంస్థ డిప్యూటి కమీషనర్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# అఖండ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం జగన్



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
దేవదాయశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అష్టోత్తర శత కుండాత్మక, చండీ, రుద్ర, రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం బుధవారంతో ముగిసింది. వేద మంత్రోచ్ఛారణల నడుమ పీఠాధిపతులు ముందుండి నడిపించగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మహాయజ్ఞ అఖండ పూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా పూర్తైంది. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, శాంతి సౌభాగ్యాలు, పాడిపంటలు, సిరి సంపదలు, ఆయురారోగ్యాలతో ప్రజలంతా వర్థిల్లాలని కాంక్షిస్తూ, ప్రకృతి అనుగ్రహం ఎల్లప్పుడూ కొనసాగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్ ఈనెల 12వ తేదీన మహాయజ్ఞ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆరు రోజులపాటు నిత్య పారాయణాలు, వైదిక క్రతువులు, వివిధ క్షేత్రాల కల్యాణోత్సవాలు, పీఠాధిపతుల అనుగ్రహభాషణలు, ప్రవచనాలు, పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన మహాయజ్ఞ క్రతువులో 600 మందికి పైగా రుత్వికులు, వేదపండితులు పాలుపంచుకున్నారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ దంపతులు దీక్షాధారణ చేపట్టి రోజువారీ యజ్ఞ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

మహాయజ్ఞం ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం జగన్‌కు వేద పండితులు మంగళ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పాంచరాత్ర, వైదిక స్మార్త, వైఖానస, శైవ ఆగమ యాగశాలలను సందర్శించిన సీఎం జగన్ వేద పండితుల సూచనలకు అనుగుణంగా హోమగుండంలోకి సుగంధ ద్రవ్యాలను జారవిడిచి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక మండపంలో ఏర్పాటు చేసిన అనంత (మహా) లక్ష్మీ అమ్మవారికి స్వయంగా పంచామృతాలతో అభిషేకం చేసి హారతి ఇచ్చారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులందరి పేర్లతో, గోత్రనామాలతో వేదపండితులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా రూపొందించిన దుర్గగుడి మాస్టర్ ప్లాన్ నమూనాను యజ్ఞశాల వద్ద ముఖ్యమంత్రి పరిశీలించారు.

మహాయజ్ఞం అఖండ పూర్ణాహుతి కార్యక్రమంలో విశాఖ శారదా పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్రస్వామి, మైసూరు దత్తపీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానందస్వామి, రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థస్వామి, విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీస్వాత్మానందేంద్ర స్వామితోపాటు శ్రీత్రిదండి దేవనాథ జియ్యర్ స్వామి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలందరి బాగోగులు కోరుతూ ప్రత్యేక సంకల్పం తీసుకుని మహాయజ్ఞ దీక్షను నిర్వహించిన సీఎం జగన్‌కు పీఠాధిపతులు వేర్వేరుగా వేదాశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, మంత్రి బొత్స సత్యనారాయణ దంపతులు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు, మంత్రులు తానేటి వనిత, జోగి రమేష్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సేనాని (ప్రజా సేవకుడు) పోస్టర్ ఆవిష్కరణ



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
నగరంలో 'సేనాని (ప్రజా సేవకుడు)' పోస్టర్ ఆవిష్కరణ ఘనంగా జరిగింది. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన నగరంలో 'సేనాని (ప్రజా సేవకుడు)' పోస్టర్ ఆవిష్కరణకు ముఖ్య అతిధులుగా జనసేన నాయకులు పోతిన వెంకటమహేష్, షేక్ రియాజ్, అడ్డూరి శ్రీరామ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జనసేనాని పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రస్థానంను బయోపిక్‌గా దృశ్యం రూపంలో మలిచినందుకు చిత్ర యూనిట్ అభినందించారు. ఈ చిత్రం విజయాన్ని సాధించి దీనిలో నటించి ప్రతివారికి మరిన్ని అవకాశాలు రావాలన్నారు. నేటి యువతలో పవన్‌కళ్యాణ్‌కు వున్న అభిమానాన్ని గుర్తుచేసి ఆయన చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు నడవాలన్నారు. ప్రొడ్యూసర్ పగడాల శ్రీయ, పగడాల కంబైన్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రంలో జూనియర్ పవన్‌కళ్యాణ్ హీరోగా, స్టోరీ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ శివరామ్‌కుమార్ సవరం, మూలకథ, రచయిత దాలియ నాయుడు బొండుపల్లి, కెమెరామెన్ కె.రమణ, సంగీతం ఎస్.కె.బాజీ, ప్రొడక్షన్ మేనేజర్ ఎస్.ఎన్.రోహిణికాంత్, ఆర్టిస్ట్ కో ఆర్డినేటర్ ఎస్.ఎన్.నాయుడు తదితరులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చిత్రయూనిట్, అభిమానులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐ పెన్షనర్స్ ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ఎస్‌బిఐ పెన్షనర్స్ (ఎస్‌బిఐ పెన్షనర్స్ క్లబ్) ఆధ్వర్యంలో రోడ్డుమీద వ్యాపారం చేసుకునే చిన్నపాటి వ్యాపారస్తులకు పెద్ద గొడుగులను పంపిణీ చేశారు. సోమవారం కొత్తవంతెన మీద జీవనోపాధి కోసం నిత్యం వ్యాపారం చేసుకునే చిన్న పాటి వ్యాపారస్తులకు వేసవి కాలంలో ఎండ తాకిడిని తట్టుకుని కూర్చునేందుకు వీలుగా పెద్ద సైజులో వుండే గొడుగులను పంపిణీ చేసినట్లు కార్యక్రమ నిర్వాహకులు ఎస్.రామకృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.రామకృష్ణారావు మాట్లాడుతూ రిటైరైన తరువాత కూడా తమ తోటి పెన్షనర్స్ సహాయ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తమ అందరి సమిష్టి కృషి అని తెలిపారు. కోవిడ్ సమయంలో కూడా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామన్నారు. వృద్ధాశ్రమాలకు నిత్యావసర సరుకులు పంపిణీతోపాటు, బట్టలు, చెప్పులు, ఆర్థిక సహాయం కూడా అందజేస్తూ వున్నామన్నారు. రైల్వేస్టేషన్ దగ్గర, రోడ్డు ప్రక్కన వుండే ఫుట్‌పాత్‌లపై వుండే వృద్ధులు, వికలాంగులకు అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. గతంలో టిటిడి స్వామివారికి కూడా కూరగాయలు పంపించామన్నారు. సుమారు వందమంది బుట్టలు, బండ్ల ద్వారా జీవనోపాధి కోసం వ్యాపారం చేసుకునే పేదవారికి పెద్ద సైజులో వున్న గొడుగులు పంపిణీ చేస్తున్నామని రేటుతో రాజీపడకుండా మన్నికైన వాటిని వారికి ఎండకు, వానకు ఉపయోగపడే విధంగా తమ గుర్తుగా అందజేసి సహాయం చేస్తున్నామన్నారు. తాము చేస్తున్న ప్రతి సామాజిక సేవా కార్యక్రమానికి సహకరిస్తున్న సభ్యులందరి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వి.ప్రసాదబాబు, యతిరాజాచారి, దీక్షితులు, సత్యనారాయణ, వామనమూర్తి, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో లక్ష్మీ దియా ఆటో ఫైనాన్స్ ప్రారంభం




**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
నగరంలోని ప్రజలకు అందుబాటులోకి లక్ష్మీ దియా ఆటో ఫైనాన్స్ సంస్థ ప్రారంభమైంది. సోమవారం సీతారాంపురం, ఏలూరు రోడ్డులో లక్ష్మీ దియా ఆటో ఫైనాన్స్ సంస్థ అధినేతలు సిహెచ్.శంకరరావు, వి.రాంబాబు, జి.సదాశివరావుల సారధ్యంలో వాహన వినియోగదారుల కోసం నూతనంగా నెలకొల్పబడిరది. ఈ సందర్భంగా బి.శేషగిరిరావు మాట్లాడుతూ ప్రారంభోత్సవ ఆఫర్ క్రింద కస్టమర్ దేవుళ్ళకు మావద్ద పాత %ు% కొత్త 2 వీలర్స్ 1 రూ. వడ్డీకి ఫైనాన్స్ చేయబడుతుందన్నారు. ప్రముఖ కంపెనీల అన్ని రకాల బైక్స్‌లతోపాటు కార్లకు ఫైనాన్స్ సౌకర్యం కలదన్నారు. నిష్ణాతులైన మెకానిక్‌లచే పరీక్షించబడి అన్ని రకాలుగా కండిషన్‌లో వుండి అందుబాటు ధరలలో వాహనాలను అందజేస్తామన్నారు. ఫైనాన్స్ కోసం సమయం వృధా చేయకుండా కస్టమర్ల కోసం ఎక్కడికో వెళ్ళకుండా తమవద్దే అతి తక్కువ వడ్డీతో ఫైనాన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఆటోమొబైల్, వెహికల్ రంగంలో టూవీలర్స్, 4 వీలర్స్ రిపేర్ల విషయంలో నిష్ణాతులైన మెకానిక్‌లు, ఫైనాన్స్‌రంగంలో అనుభవంతో లాభాపేక్ష లేకుండా వినియోగదారులకు నమ్మకం, సర్వీసు అందించడమే ధ్యేయంగా ఈ సంస్థను స్థాపించామన్నారు. ఈ అవకాశాన్ని నగరంలోనే కాకుండా చుట్టు ప్రక్కల ప్రాంతాలు వారు కూడా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాహన వినియోగదారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 25 నుండి 31వ తేదీ వరకు శ్రీశైల మహాక్షేత్రంలో నిర్వహించ తలపెట్టిన మహాకుంభాభిషేకం వాయిదా



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ఈనెల 25 నుండి 31 వ తేదీ వరకు శ్రీశైల మహాక్షేత్రంలో నిర్వహించ తలపెట్టిన మహాకుంభాభిషేకం కార్యక్రమాన్ని వాయిదా వేయటం జరిగిందని దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రదేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12 వ తేదీ నుండి 17వ తేదీ వరకు నిర్వహించిన అష్టోత్తర శత కుండాత్మక శ్రీ చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. అయితే వేసవి వడగాల్పుల దృష్ట్యా భక్తులు ముఖ్యంగా వృద్దులు పిల్లలు పాల్గొనలేకపోయారన్నారు. ఈ అనుభవం దృష్ట్యా ఈనెల 25 నుండి 31వ తేదీ వరకు శ్రీశైల మహాక్షేత్రంలో నిర్వహించవల్సిన మహాకుంభాభిషేకం కార్యక్రమాన్ని పండితులతో సంప్రదించిన పిమ్మట, వారి సూచనల మేరకు పవిత్రమైన కార్తీకమాసంలో నిర్వహించాలని తలపెట్టడం జరిగిందని తెలియపర్చారు. మహాకుంభాభిషేకంలో భక్తులు ప్రత్యక్షంగా పాల్గొనేవిధంగా, పరమ శివునికి అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసంలో నిర్వహిస్తే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని భావిస్తున్నామని ఈ మార్పును భక్తులు గమనించాలని, ఎక్కువ మంది భక్తులు కార్తీక మాసంలో ప్రసిద్ధ శ్రీశైలం క్షేత్రంలో జరిగే మహాకుంభాభిషేకంలో పాల్గొనాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై జ్యోతిష్యపండితుల ద్వారా ముహూర్తం నిర్ణయం చేసి త్వరలో తేదీని తెలియపరుస్తామని దేవాదాయ శాఖ కమిషనర్ తెలిపారు.

## హొటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం : రమణ ప్రసాద్

**తిరుపతి, నేటి పత్రిక ప్రజావార్త :**



తిరుపతి జిల్లా కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖలచే సంయుక్తంగా నిర్వహిస్తున్న స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హొటల్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రీషియన్ కళాశాలలో 2023-24 సంవత్సరం హొటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ జూలై 30 వరకు ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ డా.ఆర్.రమణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల వివరాలు : 1. బి.ఎస్.సి. మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్‌నందు 50 శాతం మార్కులు కలిగిన వారు 2. క్రాఫ్ట్ కోర్స్ ఇన్‌ఫుడ్ ప్రొడక్షన్ 1 సంవత్సరం ఎస్.ఎస్.సి. పాసైన వారు 3. సర్టిఫికేట్ కోర్స్ ఇన్ ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీసెస్ ఆరు నెలలు ఎస్.ఎస్.సి. పాసైన వారు అర్హులని, కోర్సు పూర్తైన తరువాత ప్రముఖ ఫైవ్‌స్టార్ హొటల్స్‌లో ఉద్యోగ అవకాశాలు, బ్యాంక్ లోన్ సదుపాయం, రవాణా సౌకర్యం, బాల బాలికలకు వేరు వేరు హాస్టల్స్ సదుపాయం కలదని యువత సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9700440604, 9100558006, 9701343846 నెంబర్లను సంప్రదించాలని www.sihmtpt.org నందు దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిన ముఖ్యమంత్రి జగనన్న



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
వైద్యరంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు చేపట్టి అత్యాధునిక మౌళిక వసతులను కల్పించడం ద్వారా ప్రతి పేద వానికి కార్పొరేట్ వైద్యం అందించడంతో పాటు ఉచితంగా మందులను అందజేస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఎ కొండూరు మండల ప్రాధమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కిడ్నీ రోగులకు ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ పేద వర్గాల ఆరోగ్యం పట్ల ఏ ముఖ్యమంత్రి ఆలోచన చేయని విధంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఎ కొండూరు ప్రాంతంలో గిరిజన తండాలకు చెందిన ప్రజలు కిడ్నీ వ్యాధి భారిన పడి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి గిరిజనులు అనారోగ్యంతో భాధపడుతున్నప్పటికీ గత ప్రభుత్వాలు వారి పట్ల నిర్లక్ష్యం చూపాయన్నారు. కిడ్నీ బాధితుల భాధలను గుర్తించి సమస్యకు గల కారణాలను గుర్తించాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారన్నారు. కిడ్నీ వ్యాధికి ఈ ప్రాంతంని భూ గర్భ జలాలలో ఫ్లోరిన్ ఎక్కువ శాతం ఉండటం కారణమని నిర్ధారణకు రావడంతో ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి కృష్ణా జలాలను తండా ప్రజలకు సరఫరా చేసేందుకు రక్షిత మంచినీటి పథకానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు కనీసం ఒక మెడికల్ కళాశాల అయినా ఉండాల్సిందేననే లక్ష్యంతో ఏకంగా 17 మెడికల్ కళాశాలలు నిర్మిస్తున్నారన్నారు. ఈ విద్యా సంవత్సరం నుండి రూ.2500 కోట్ల ఖర్చుతో 750 మెడికల్ సీట్లతో 5 కాలేజీలలో అడ్మిషన్స్ ప్రారంభించనున్నామని ఆగష్టు నుండి క్లాసులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ అనే పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. కిడ్నీ పేషంట్లకు నెలకు రూ.10వేల పింఛను అందించడమే కాకుండా ఉచితంగా మందులు, డయాలసిస్ సౌకర్యం కల్పిస్తూ పింఛనును, నెఫ్రాలజిస్ట్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ జె.నివాస్ మాట్లాడుతూ పి.హెచ్.సిలో పరీక్షలు నిర్వహిస్తారని, పరీక్షలో ఏమైనా ఆరోగ్య సమస్య ఉంటే వైద్యులు సూచించిన విధంగా మందులు తీసుకొని వ్యాధి తీవ్రతను అరికట్టవచ్చున్నారు. జిల్లా కలెక్టర్ యస్.ఢిల్లీరావు మాట్లాడుతూ ఎ కొండూరు ప్రాంతంలో ప్రజలు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పరిస్థితిని గమనించిన ప్రభుత్వం వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించాలనే నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఎ కొండూరు తండా వాసులకు సురక్షితమైన త్రాగునీటిని అందించేందుకు 2 కోట్ల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. తండా ప్రజలకే కాకుండా మండలానికి చెందిన ప్రజలందరికీ రక్షిత మంచి నీటి సరఫరా చేసేందుకు ముఖ్యమంత్రి హామీని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు కొక్కిలి గడ్డ రక్షణ నిధి, వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ ఎస్. వెంకటేశ్వరరెడ్డి, ఏపీఎంయస్ ఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ డి. మురళీధర్ రెడ్డి, ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డా.వి.రామిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డా. యం. సుహాసిని, డిసిహెచ్ఎస్. డా.జి. స్వప్న, ఎ కొండూరు మండల ఎంపిపి కె. నాగలక్ష్మి, జెడ్ పిటిసి భూక్యా గన్యా, ఎంపిటిసిలు యస్.పద్మ, భూక్యా సోమేశ్వరి, గ్రామ సర్పంచ్ వెంపటి రజిని తదితరులు పాల్గొన్నారు.

# పాలీసెట్ లో 86.35% శాతం మంది ఉత్తీర్ణత

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి పాలిటెక్నిక్ ప్రవేశానికై నిర్వహించిన పాలీసెట్-2023 ప్రవేశ పరీక్ష ఫలితాలను సాంకేతిక విద్యాశాఖ కమీషనర్ చదలవాడ నాగరాణి శనివారం విజయవాడలో విడుదల చేశారు. మొత్తం 1,60,332 విద్యార్థులకు గాను 1,43,625 విద్యార్థులు (89.58 శాతం) పరీక్షకు హాజరు కాగా అందులో 1,24,021 మంది ( 86.35 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురు 88,068 హాజరై, 74,633 మంది (84.74 శాతం) ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 55,557 మంది హాజరై 49,388 మంది (88.9 శాతం) ఉత్తీర్ణత సాధించారు. పాలీసెట్ 2023 లో 120 మార్కులకు గాను 30 మార్కులను ఉత్తీర్ణతగా నిర్ణయించామని, అయితే ఎస్ సి, ఎస్ టి అభ్యర్థులకు కనీస మార్కుల నిబంధన లేదని ఈ సందర్భంగా నాగరాణి తెలిపారు. ఫలితంగా పాలిసెట్-2023 పరీక్షకు హాజరైన ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు అందరూ అర్హత సాధించినట్లు అవుతుందన్నారు. ర్యాంకింగ్ విధానం గురించి వివరిస్తూ అభ్యర్థి సాధించిన మొత్తం మార్కుల ఆధారంగా ర్యాంకులు ఇచ్చామని, మార్కులు సమానంగా పొందిన అభ్యర్థులకు, గణితంలో వారి మార్కుల ఆధారంగా ర్యాంక్ నిర్ణయించామన్నారు. అప్పటికీ సమానత ఉన్నప్పుడు, భౌతిక శాస్త్ర మార్కుల ఆధారంగా ర్యాంక్ నిర్ణయించబడిందన్నారు. అప్పటికీ సమాన మార్కులు సాధిస్తే వారికి ఒకే ర్యాంక్ ఇవ్వడం జరిగిందని, వీరికి పుట్టిన తేది, పదవ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా కౌన్సిలింగ్ సమయంలో వారికి తగిన కళాశాలను కేటాయిస్తారని కమిషనర్ వివరించారు. పాలిసెట్-2023 ర్యాంకుల వివరాలను https://polycetap.nic.in వెబ్ సైట్ నుండి పొందవచ్చని, పాలిటెక్నిక్ ప్రవేశానికి సంబంధించిన వెబ్ కౌన్సెలింగ్ మే 29 నుండి నిర్వహిస్తామని, ఇందుకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రకటన త్వరలో విడుదల చేస్తామన్నారు. అభ్యర్థులు ఆ ప్రకటననే కాల్‌లెటర్‌గా భావించి వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, ధృవపత్రాల పరిశీలన, కౌన్సిలింగ్ నిమిత్తం విడిగా ఎటువంటి కాల్‌లెటర్ పంపబడదని నాగరాణి స్పష్టం చేశారు. వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరు కాని అభ్యర్థులు 2023-24 విద్యా సంవత్సరంలో కన్వీనర్ కోటాలో పాలిటెక్నిక్ ప్రవేశానికి అర్హత కోల్పోతారన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్యా శాఖ సంయుక్త సంచాలకులు వెలగా పద్మారావు, రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి కార్యదర్శి కేవీ రమణబాబు, సంయుక్త కార్యదర్శి డాక్టర్ బి జానకిరామయ్య, ఉప కార్యదర్శి రవికుమార్, డాక్టర్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt Ltd, D.NO: 33-5-9 Papaiah Street, Seethurampuram, VIJAYAWADA, Krishna District , Andhra Pradesh and Published From H.No: 24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line cross, VIJAYAWADA Krishna District Andhra Pradesh. Editor Konduri Srinivasarao, RNI Title APTEL/2021/80559, Phone :9948877444, Email id: konduri9999@gmail.com